ఈనాడు
హనుమకొండ

మంత్రి ఆదేశాలు.. అధికారుల ఆచరణ


ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలక మురళితో సమావేశమైన ఇంజినీరింగ్ అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితో పాటు కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ)లోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈక్రమంలో ఎంజీఎం, కేఎంసీ ఆసుపత్రుల్లోని సమస్యల ప్రస్తావన వచ్చింది. సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తామని మంత్రి ఆదేశించారు. దీంతో బుధవారం ఎంజీఎం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.మురళి అధ్యక్షతన కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజినీర్ దేవేంద్రకుమార్, ఈఈ ప్రసాద్, డీఈ రాజశేఖర్, ఏఈలు, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ సమావేశమయ్యారు. అనంతరం ఎంజీఎం, కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సమస్యాత్మకంగా ఉన్న వార్డులు పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ డా.మురళి ఆధ్వర్యంలో అధికారులు జిల్లా కలెక్టర్ డా.సత్యశారదను కలిశారు. సమావేశంలో చర్చించిన అంశాలతోపాటు పరిశీలనలో గుర్తించి, ప్రతిపాదించిన సమస్యలను ఆమెకు వివరించారు.

చలికాలం గజగజే..

శీతాకాలం ప్రారంభం కానుంది. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు చలిని తలుచుకొని అప్పుడే గజగజా వణికిపోతున్నారు. సరైన దుప్పట్లు లేవు. కిటికీ తలుపులు విరిగిపోయినా మరమ్మతు చేయించే దిక్కులేదు. చన్నీళ్లతో స్నానాలు. దీంతో జలుబు, జ్వరాల బారినపడే అవకాశం ఎక్కువ. ఏటా ఇవే సమస్యలు ఎదురవుతున్నా ప్రభుత్వం సకాలంలో వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించడం లేదు. చలి కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలను పరిశీలించింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..

– న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

దాతలూ.. ముందుకురండి!

చలికాలం సమీపిస్తోంది. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు తలుపులు లేక, దోమలు రాకుండా జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజా ప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

పరిశీలన

దోమల బెడద..


దోమలు రాకుండా కిటికీలకు ఏర్పాటు చేసిన జాలీ పరిస్థితి

భీమదేవరపల్లి మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో 25మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన బెడ్‌ షీట్, దుప్పటి పలుచగా ఉండటంతో చలిని ఆపడం లేదని రగ్గులు ఇంటి నుంచే తెచ్చుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉంది. కిటికీలకు ఏర్పాటు చేసిన జాలీలు చిరిగిపోయాయి. వసతిగృహం పక్కనే చెరువు ఉండడంతో చలి, దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం చన్నీళ్ల స్నానమే. చలికాలం అయినా వేడినీళ్ల కోసం గీజర్, తాగడానికి శుద్ధజలం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. వార్డెన్ వీరన్ననాయక్‌ను వివరణ కోరగా రెండ్రోజుల్లో కిటికీలకు జాలీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చలికాలం ప్రభుత్వం మందంపాటి రగ్గులు సరఫరా చేస్తే విద్యార్థులకు అందిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

జిల్లాలోని పలు వసతిగృహాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. కిటికీలకు కట్టిన జాలీలు చిరిగిపోయినా కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. కొందరికి ఇచ్చిన బెడ్‌షీట్లు, దుప్పట్లు పలుచగా ఉండటంతో అవి చలిని ఆపేలా లేవు. ఏ హాస్టల్‌లోనూ స్నానాలకు వేడినీటి సదుపాయం లేదు. ఎంత చలికాలమైనా చన్నీటితో స్నానాలే. ఇక మరుగుదొడ్లకు తలుపులు ఉండవు. వాటిని శుభ్రం చేసే దిక్కులేదు.

జిల్లాలో వసతి గృహాల వివరాలు..

	● వసతి గృహాలు	● విద్యార్థులు
బీసీ	15	1321
ఎస్టీ	13	2363
ఎస్సీ	24	1300

అతుకుల కిటికీలు

పరకాల పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో మొత్తం 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఆగస్టులో దుప్పట్లు పంపిణీ చేశారు. రెండు నెలలకు సంబంధించిన సబ్బుల బిల్లులు రావాల్సి ఉంది. వసతి గృహంలోని గదుల కిటికీ తలుపులు విరిగిపోవడంతో చల్లగాలి వస్తోంది. ఓ తలుపునకు పిల్లలు టీ షర్టును అడ్డు వేశారు. మరో తలుపును రేకుతో మూసివేశారు. స్నానాల గదులు, మరుగుదొడ్ల ముందు ఫ్లోరింగ్ లేకపోవడంతో ఆరు బయటే స్నానాలు చేస్తున్నారు. దెబ్బతిన్న కిటికీ తలుపులకు మరమ్మతులు చేయాలి. సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేయాల్సి ఉంది. పనులన్నింటిని వారం, పదిరోజుల్లో పూర్తి చేస్తామని వార్డెన్ అనిల్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పరకాల


పరకాలలో బీసీ హాస్టల్ గది కిటికీ తలుపుకు అడ్డుగా వేసిన టీ షర్టు, మరో కిటికీని రేకుతో మూసిన దృశ్యం (ఇన్‌సెట్లో)

దుప్పట్ల పంపిణీ లేదు..


మరుగుదొడ్లకు విరిగిన తలుపులు

కమలాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 39 మంది విద్యార్థులు ఉంటున్నారు. జడ్పీ, ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్నారు. ఇప్పటి వరకు చలి తీవ్రతను తట్టుకునే దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లు పంపిణీ చేయలేదు. మరుగుదొడ్లు కొన్నే వినియోగంలో ఉన్నాయి. మిగతా వాటికి తలుపులు విరిగిపోయాయి. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో రోజూ శుద్ధజలం కొనుగోలుచేస్తున్నారు. హాస్టల్‌లో ఉన్న వాటర్ ప్లాంటు పాడైనా మరమ్మతులు చేయించలేదు.

– న్యూస్‌టుడే, కమలాపూర్

గతేడాది ఇచ్చినవే..


కడిపికొండలోని మైనారిటీ వసతి గృహంలో పాత దుప్పట్లు కప్పుకొన్న విద్యార్థులు

కడిపికొండలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఇచ్చిన దుప్పట్లు తప్ప కొత్తవి ఇవ్వలేదు. మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలలో 640 మంది, బాలుర పాఠశాలలో 620 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటి వరకు దుప్పట్లు రాలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్నవి, గతేడాది ఇచ్చిన వాటినే కప్పుకొంటున్నారు. చలికాలం ఆరంభం అవుతుందని, త్వరలోనే ప్రభుత్వం నుంచి పంపిణీ చేస్తారని ప్రిన్సిపల్ డీసీవో దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ప్రస్తుతానికి విద్యార్థులకు సరిపడా దుప్పట్లు ఉన్నాయన్నారు.

– న్యూస్‌టుడే, మడికొండ

గురుకుల విద్యార్థినులు పోటీల్లో సత్తా చాటాలి


జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావిణ్య, బీసీ సంక్షేమశాఖ డీడీ రాంరెడ్డి, డీసీవో వెంకటప్రసాద్


వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరుస్తున్న కలెక్టర్

కమలాపూర్, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థినులు క్రీడా పోటీల్లో సత్తా చాటాలని హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. బుధవారం కమలాపూర్‌లోని బాలికల గురుకుల పాఠశాల మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి (అండర్-17) క్రీడా పోటీలను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముందుగా ఉమ్మడి జిల్లాలోని 18 గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన 630 మంది క్రీడాకారులు కవాతు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నిఖత్ జరీన్, జీవంజీ దీప్తిలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, ఎంజేపీ గురుకులాల డీసీవో వెంకటప్రసాద్, కమలాపూర్ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, బాలుర పాఠశాల ప్రిన్సిపల్ టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం..


కరుణాపురంలోని గురుకుల పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఆర్‌సీవో రాజ్‌కుమార్

ధర్మసాగర్: క్రీడలు విద్యార్థుల్లో మానసిక వికాసానాకి దోహదం చేస్తాయని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ గురుకులాల ఆర్‌సీవో రాజ్‌కుమార్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో నిర్వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ బాలుర బీసీ గురుకులంలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రీడోత్సవాలను ఆయన బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా గుణం, మానవీయతను పెంపొందించుకోవాలన్నారు. 18 పాఠశాలల నుంచి విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరయ్యారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ రవికుమార్

ఈ సైకిలే ఆయనకు వైద్యుడు



అవును ఇది నిజమే.. ఆయన గత 55 ఏళ్లుగా సైకిల్‌నే నమ్ముకుని ఆరోగ్యంగా ముందుకు సాగుతున్నారు. ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన గడ్డం శంకరయ్య ముల్కనూర్‌లోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో అటెండర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం తన కులవృత్తి పంబాల పూజారిగా ఆయా గ్రామాల్లో పనిచేస్తున్నారు. తన 13 ఏళ్ల ప్రాయంలో సైకిల్ తొక్కడం ప్రారంభించిన శంకరయ్య ఇప్పటికీ ప్రతిరోజు 18 కిలోమీటర్లకు పైగా దానిపైనే ప్రయాణం చేస్తున్నారు. తాను ఆరోగ్యంగా ఉండడానికి కారణం సైకిల్ తొక్కడమే అని చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన వయస్సు 68 ఏళ్లు. ఎక్కడికైనా సైకిల్‌పైనే వెళ్లి రావడం ఆయనకు అలవాటు. భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో పూజారి పనులు చేసి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి



ప్రకృతి అందం.. చెరువులో ప్రతిబింబం

చుట్టూ ఉన్న చెట్లు, పచ్చదనం నీటిలో ప్రతిబింబిస్తూ ప్రకృతి ప్రేమికులను అలరిస్తున్న ఈ దృశ్యం హనుమకొండలోని 56వ డివిజన్ గోపాలపూర్ చెరువులోది. శ్రీమహాలక్ష్మి ఆలయం పక్కనున్న చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండలా తొణికిసలాడుతోంది. కట్టపై పెరిగిన చెట్ల ప్రతిబింబం ఉదయం వేళ ఇలా నీళ్లలో ఎంతో అందంగా కనిపిస్తోంది. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది.

– న్యూస్‌టుడే, గోపాలపూర్ (హనుమకొండ)

ప్రధాన రహదారి అంధకారం



వడ్డేపల్లి చర్చి నుంచి ఫిల్టర్‌బెడ్ మీదుగా ఉనికిచెర్ల జాతీయ రహదారి వరకు విద్యుద్దీపాలు లేక రాత్రివేళ అంధకారంగా ఉంటోంది. ఈ మార్గంలో ఎనిమిది నెలల కిందట ఫిల్టర్‌బెడ్ సమీపంలో రైల్వేట్రాక్‌పై వంతెన నిర్మాణంతో పాటు రోడ్డు వేశారు. సుమారు 5కిలోమీటర్ల మేర రోడ్డు మధ్య విభాగిని నిర్మించి విద్యుత్తు స్తంభాలు, లైట్లు బిగించారు. నెలలు గడుస్తున్నా దీపాలు మాత్రం వెలగడం లేదు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. – న్యూస్‌టుడే, బాలసముద్రం

ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ ఈడీ మునిశేఖర్ అన్నారు. బుధవారం వరంగల్ రీజియన్ కార్యాలయంలో జోన్ పరిధిలోని నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ రీజియన్ మేనేజర్లు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, వివిధ డిపోల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ అంటే ప్రయాణికులకు నమ్మకమని, వారికి మెరుగైన సేవలు అందిస్తూనే లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ అందించాలని చెప్పారు. ప్రతి డిపో పరిధిలో నెలా నెలా సమీక్షలు నిర్వహిస్తూ సంస్థ పురోగతిని పరిశీలించుకోవాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్, ఆర్టీసీ సిబ్బందికి అందించే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాలలో ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు, వివిధ రీజియన్ల మేనేజర్లు పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఠాణా ఎస్సైలు ఎ.ప్రవీణ్‌కుమార్, ఎం.రాజేందర్, తరిగొప్పుల ఠాణా ఎస్సై ఎ.శ్వేతను కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

అర్జీలు పరిశీలించి.. సవరణ చేయండి


కార్పొరేషన్, న్యూస్‌టుడే: భువన్ యాప్‌లో 40 వేల అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆస్తిపన్ను సవరణలు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా. అశ్విని తానాజీ తెలిపారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో భువన్ యాప్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో తాజా పురోగతిపై కమిషనర్ సమీక్షించారు. ప్రతి ఆర్ఐ రోజూ 150 దరఖాస్తులు పరిశీలించి భువన్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఉప కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ, న్యూస్‌టుడే: కాజీపేట మండలం మడికొండలోని దుర్గబాయి మహిళా శిశు వికాస కేంద్రం(ప్రాంగణం)లో రెండు సంవత్సరాల ఏఎన్ఎం కోర్సుకు మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా మేనేజరు పి.జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారు 18సంవత్సరాలు నిండి ఇంటర్ ఉత్తీర్ణత పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ అభ్యర్థినులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ హైదరాబాద్ పేరు మీద రూ.200లు డీడీ తీసి www.chfw.telangana,gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25 వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు 7660022525 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.



స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్లు నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం

ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండడంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఏడాది వరుస ఘటనలు..

- కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- జయశంకర్‌భూపాల్‌పల్లి జిల్లాలో పనిచేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతగట్టు సమీపంలో అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళను తప్పించాడు. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.
- గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

విద్యారంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు

సుబేదారి, న్యూస్‌టుడే: విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్, బి.సంతోష్ అన్నారు. ఉపకార వేతనాలు చెల్లించాలంటూ బుధవారం సుబేదారి ఆర్ట్సుకళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెల 27లోపు ఉపకార వేతనాలు విడుదల చేయకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల చరణ్, కుమార్, భానుప్రసాద్, విజయ్, వేణు, శ్రీనివాస్, సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

● హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియామకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపదికనే నడుస్తాయి.'

మహాలక్ష్మి వర్తిస్తుంది..

ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందుతోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు

- చొల్లేటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో



మామూలు ఆర్టీసీ బస్సులకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సీటింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..







- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లేటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

● వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులను చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బూజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం ఇరువైపులా భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణకు సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఎటూ 50 ఫీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాలో కలిపి మొత్తం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికిగాను రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఆ పనులను పూర్తి చేయడానికి గడువు.

● దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన

వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!


● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. – జనగామ, న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'

'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'

యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా–2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163




ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)

'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'

2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.



● విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.

భూపాలపల్లి (బుడా)

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'



కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.

● ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.

మహబూబాబాద్ (ముడా)

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జిలతో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లావాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

దీపావళికి కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కాజీపేట మీదుగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. 07003 నంబరుతో సికింద్రాబాద్‌-పాట్నా మధ్య ఈ నెల 26, వచ్చే నెల 2, 9వ తేదీలలో ఉంటుంది. సికింద్రాబాద్‌లో ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు పాట్నా చేరుతుంది. 07004 నంబరుతో తిరుగు ప్రయాణంలో పాట్నా నుంచి ఈ నెల 28న, వచ్చే నెల 4, 11వ తేదీల్లో అందుబాటులో ఉంటుంది. మౌలాలీ-ముజఫర్‌పూర్‌ మధ్య 07649 నంబరుతో ఈ నెల 28, వచ్చే నెల 4, 11 వతేదీలలో ఉంటుంది. మౌలాలిలో సాయంత్రం సోమవారం 4.45 గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 2.30 గంటలకు ముజాఫర్‌పూర్‌ చేరుతుంది. 07650 నంబరుతో తిరుగు ప్రయాణం ఈ నెల 30, వచ్చే నెల 6, 13వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. ముజాఫర్‌పూర్‌లో బుధవారం ఉదయం 4.50 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 7 గంటలకు లింగంపల్లి (తిరుగు ప్రయాణం లింగంపల్లి వరకు) చేరుతుంది. సనత్‌నగర్‌ నుంచి శంత్రాగాచీకి 07069 నంబరుతో ఈ నెల 30న, వచ్చే నెల 6వ తేదీలలో ఉంటుంది. సనత్‌నగర్‌లో బుధవారం ఉదయం 6.20 గంటలకు బయలుదేరి, గురువారం మధ్యాహ్నం 12.20 గంటలకు శంత్రాగాచీ చేరుతుంది. తిరుగు ప్రయాణం 07070 నంబరుతో ఈ నెల 31, వచ్చే నెల 7వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. శంత్రాగాచీలో సాయంత్రం గురువారం 5.25 గంటలకు బయలుదేరి, శుక్రవారం రాత్రి 11.50 గంటలకు సనత్‌నగర్‌ చేరుతుంది. పాట్నా ప్రత్యేక రైలు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది. ముజాఫర్‌పూర్‌ ప్రత్యేక రైలు చర్లపల్లి, జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది.

నివాసాల మధ్య దుర్గంధం



మైత్రి నగర్‌ జనావాసాల మధ్య మురుగునీరు

హనుమకొండలోని సప్తగిరి కాలనీ, మైత్రినగర్‌లో నివాసాల మధ్య మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీని కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి చర్చి నుంచి ఫిల్టర్‌బెడ్‌ మధ్య బ్రిడ్జి కట్టినప్పటి నుంచి వంతెనకు ఇరువైపులా ఉన్న ఈ కాలనీల్లో మురుగు సమస్య నెలకొంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. పెద్ద వర్షం కురిసిందంటే మైత్రినగర్‌ వాసులు ఇటు వడ్డేపల్లి చర్చివైపు, అటు ఫిల్టర్‌బెడ్‌ రోడ్డుపైకి రావాలంటే నడుంలోతు నీటిలో ఇబ్బందులు పడాల్సింది. - న్యూస్‌టుడే, వడ్డేపల్లి

సీసీరోడ్డు వేసినా వాననీటి ఇబ్బందులే

నగరంలోని 4వ డివిజన్‌ యాదవ నగర్‌ ఆర్చి నుంచి కృష్ణకాలనీ, లోటస్‌ కాలనీ వరకు కుడా నిధులతో 15 రోజుల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు లెవల్‌ చేయకపోవడంతో వర్షం పడితే నీరు నిలుస్తోంది. అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయని, రూ. లక్షలు వెచ్చించి వేసిన రోడ్డుకు అప్పుడే ఈ పరిస్థితి ఏమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. తక్షణం స్పందించి రోడ్డు లెవల్‌ చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా



రోడ్డు లెవల్‌ లేకపోవడంతో నిలిచిన నీరు

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ

ధర్మసాగర్‌, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలని సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ముప్పారం కేజీబీవీని ఆమె బుధవారం ఎంపీడీవో అనిల్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. వంటగది, భోజనాన్ని, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం నారాయణగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.



నారాయణగిరిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఈవో విద్యాలత

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ ఎ. మధుసూదన్‌ కథనం మేరకు... కాజీపేట మండలం కమ్మరిగూడెం గ్రామంలో కె.విజయ్‌కుమార్‌ తన జనరల్‌ స్టోర్‌లో అనుమతి లేకుండా దీపావళి బాణసంచా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మడికొండ, టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. సుమారు రూ.3.31 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మడికొండలో డి.సంపత్‌కుమార్‌ తన కిరాణం దుకాణంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.1.48 లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ రంజిత్‌కుమార్‌, ఎస్సై వి.దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ ఎ.మధుసూదన్‌ తెలిపారు. వరంగల్‌ ఎల్‌బీనగర్‌కు చెందిన ఎండీ ఫజల్‌ ఇతర ప్రాంతాల నుంచి గుట్కా, తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టుకొని విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్‌, ఇంతేజార్‌గంజ్‌ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. రూ.4.82 లక్షల విలువ చేసే గుట్కా పట్టుకొన్నారు. కేసు విచారణ కోసం ఇంతేజార్‌గంజ్‌ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ బాబులాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ బియ్యం..

హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని వి.రామారావుకు చెందిన రామ్‌గోపాల్‌ కోళ్ల ఫారంలో అక్రమంగా రాయితీ బియ్యం నిలువ ఉంచినట్లు సమాచారం రావడంతో హసన్‌పర్తి పోలీసులతో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడులు చేశారు. రూ.25వేల విలువైన పది క్వింటాళ్ల రాయితీ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు, విచారణ కోసం హసన్‌పర్తి పోలీసులకు అప్పగించామని టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ మధుసూదన్‌ తెలిపారు.

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో పలివేల్పుల గ్రామంలో కాశీశ్వర్‌కు చెందిన కిరాణం దుకాణంలో బుధవారం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసి అక్రమంగా నిలువ ఉంచిన బాణసంచా, గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3.71 వేలు ఉంటుందని ఏసీపీ ఎ.మధుసూదన్‌ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే భవిష్యత్తు



జ్యోతి వెలిగించి ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఛైరన్‌ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

భీమారం, న్యూస్‌టుడే: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటే భవిష్యత్తు ఉంటుందని ఎస్వీఎస్‌ విద్యా సంస్థల ఛైర్మన్‌ డాక్టర్‌ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. హసన్‌పర్తి మండలం భీమారంలోని ఎస్వీఎస్‌ విద్యా సంస్థలో బుధవారం జరిగిన ఎంబీఏ, ఎంఫార్మసి, ఎంటెక్‌ విద్యార్థుల ఓరియేంటేషన్‌ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలు బత్తుల వెంకట్‌, శ్రీధర్‌ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థులకు కంపెనీల్లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఇ.వి.రావు, ప్రొఫెసర్‌ ఏకే రాథోడ్‌ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నడికుడ, న్యూస్‌టుడే: మండలంలోని వరికోలు గ్రామానికి చెందిన ఏసిరెడ్డి సమ్మక్క(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జీవితం విరక్తి చెంది మంగళవారం రాత్రి సమయంలో ఇంట్లో పురుగుమందు తాగారు. బుధవారం తెల్లవారుజామున భర్త ఏసిరెడ్డి మొగిలి గుర్తించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సట్టా నిర్వాహకుడి అరెస్టు

వరంగల్‌క్రైం: ఆన్‌లైన్‌ ద్వారా సట్టా నిర్వహిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ ఎ.మధుసూదన్‌ తెలిపారు. మిల్స్‌కాలనీ ఠాణా పరిధిలోని శాంతినగర్‌ కాలనీలో రాజయ్య ఆన్‌లైన్‌ ద్వారా సట్టా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని, ఖిలావరంగల్‌కు చెందిన విద్యసాగర్‌, శంభునిపేటకు చెందిన గౌస్‌ సట్టా ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు విచారణ కోసం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎన్జీవోస్‌కాలనీ : పింఛనుదారుల సమస్యల సాధనకు దశల వారీగా ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారాం పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అమరవీరుల సంస్మరణవారోత్సవాలను పురస్కరించుకొని విశ్రాంత పోలీస్‌ అధికారులను సత్కరించారు. నాయకులు పరికిపండ్ల వేణు, యాదగిరి, టి.నిర్మల, అశోక్‌ కోటిలింగం, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెరమరుగు!


● నగరంలో గత మూడేళ్లలో 12 థియేటర్ల మూత

ఒక థియేటర్‌ నడవడం వల్ల నగరంలో 10 మంది, గ్రామీణ ప్రాంతాల్లో అయిదుగురు ఉపాధి పొందుతారు.

గత అయిదేళ్లలో మూతబడిన థియేటర్లు

	● మొత్తం థియేటర్లు	● మూతబడినవి
త్రినగరి పరిధి	10	12
ములుగు	03	02
జనగామ	03	01

ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి పండగల వేళ కొత్త సినిమాలతో నెలకొనే కోలాహలం అంతా ఇంతా కాదు. ఇంటిల్లిపాది సినిమా చూస్తేనే పండగకు నిండుదనం వచ్చేది. కానీ! కరోనా తర్వాత సంక్షోభంలోకి వెళ్లిన వెండితెర పూర్తిస్థాయిలో కోలుకోలేదు. వరంగల్‌, హనుమకొండ, కాజీపేట త్రినగరిలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు క్రమంగా మూతబడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత అయిదేళ్లలో 15 థియేటర్లు మూసేశారు.



వరంగల్‌ నగరంలోని రామ్‌లక్ష్మణ్‌ టాకీస్‌ ఇది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైనప్పుడు తెరిచి ఆ తర్వాత మూసివేస్తున్నారు



మట్టెవాడలో మూతబడిన కాకతీయ కాంప్లెక్సు

ఫంక్షన్‌ హాల్స్‌, మాల్స్‌గా..

కొన్ని టాకీస్‌లు వేడుకల మందిరంగా మారుతుండగా.. మరికొన్ని వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ప్రేక్షకులు ఇంట్లో రంగురంగుల టీవీల్లో, చరవాణుల్లో ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. దీంతో సినిమా టాకీస్‌లపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అమ్మలా ఆదరించిన సినీ కళామతల్లికి ఇంతటి కష్టమొస్తుందని అనుకోలేదని టాకీస్‌ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లో సినిమా థియేటర్ల మూసివేత, కూల్చివేతలు గత మూడేళ్లలో ఎక్కువయ్యాయి.



వరంగల్‌ స్టేషన్‌రోడ్డులో థియేటర్‌ తొలగించి వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్న యాజమాన్యం

కాశీబుగ్గ, రంగశాయిపేట, న్యూస్‌టుడే

40 ఏళ్లుగా పనిచేస్తున్నా..: - మహ్మద్‌ దస్తగిరి, సినీ కార్మికుడు



వరంగల్‌ అజంజాహి మిల్లు సమీపంలో 40ఏళ్ల క్రితం వెంకట్రామా టాకీస్‌ కట్టారు. మొదట నెలకు రూ.240 జీతానికి టికెట్‌ కౌంటరులో పనిచేశా. గతంలో కొత్త సినిమా విడుదల అవుతుందంటే టాకీస్‌ యజమానితో పాటు మాకు ఎంతో గౌరవం ఉండేది. మూడేళ్లుగా టాకీస్‌లు సరిగా నడవక, ప్రేక్షకులు సరిగా రాక థియేటర్ల యజమానులు నష్టపోతున్నారు. థియేటర్లకు మళ్లీ పూర్వ వైభవం రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం నెలకు రూ.8 వేల జీతానికి థియేటర్‌ కాపలాదారుగా పనిచేస్తున్నా.

రాబడి లేదు..: - గందె నవీన్‌, హీరో మహేశ్‌బాబు ఫ్యాన్స్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



సూపర్‌స్టార్‌ కృష్ణ, మహేశ్‌బాబు కొత్త సినిమాలు విడుదల అయ్యే రోజు అభిమానులుగా మాకు పండగే. సినిమా విడుదలకు ముందు రోజు థియేటర్లను పెళ్లి మండపంలా ముస్తాబు చేసేవాళ్లం. ఇప్పుడు కొత్త సినిమాలు వస్తున్నా.. గతంలో ఉన్నంత ఆనందం కలగట్లేదు. నాడు ఒక సినిమా విడుదలైతే వంద రోజులు, సంవత్సరం పాటు నడిచేవి. ప్రస్తుతం ఒకేరోజు ఎక్కువ ఆటలు ఆడిస్తున్నారు. అయినా థియేటర్ల యాజమాన్యానికి రాబడి లేదు.

ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం తగదు

కమలాపూర్‌, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణి తగదని, వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్‌ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి డిమాండ్‌ చేశారు. బుధవారం కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 26న హనుమకొండలో నిర్వహించే మాదిగ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేశ్‌, జిల్లా అధ్యక్షుడు జి.సుకుమార్‌, ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు, నాయకులు చిలువేరు సంపత్‌, ఎన్‌.ప్రసాద్‌, రవీందర్‌, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ములుకనూర్‌ సహకార సంఘంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ములుకనూర్‌ సహకార గ్రామీణ పరపతి సంఘ జిన్నింగ్‌ మిల్లు ఆవరణలో బుధవారం పత్తి కొనుగోళ్లను సంఘం జనరల్‌ మేనేజర్‌ రాంరెడ్డి ప్రారంభించారు. రైతులు తాము పండించిన పత్తి పంటను రుణం కింద జమ చేసుకోవచ్చన్నారు. పత్తి తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉండాలన్నారు. వరంగల్‌ మార్కెట్‌ ధరకు అనుగుణంగా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు కడారి ఆదాం, మాజీ సర్పంచి రాంచంద్రం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకేరు వాగులో అధికారుల దాడులు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఆకేరు వాగులో ఇసుక తవ్వకాలు చేస్తుండగా మైనింగ్‌, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు బుధవారం సంయుక్తంగా దాడులు చేసినట్లు తహసీల్దార్‌ విక్రమ్‌కుమార్‌ తెలిపారు. రాంగనగర్‌ శివారు ప్రాంతంలోని వాగులో ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. ప్రొక్లెయినర్‌, ఇసుకను ఫిల్టర్‌ చేస్తున్న రెండు యంత్రాలు, 9 ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. దాడుల్లో మైనింగ్‌ ఆర్‌ఐ చంద్రకళ, ఐనవోలు ఎస్సై పి.శ్రీనివాస్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ ప్లీనరీ కరపత్రాల ఆవిష్కరణ

ఐనవోలు, న్యూస్‌టుడే: వచ్చే నెల 3న రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో జరిగే ధర్మసమాజ్‌ పార్టీ (డీఎస్పీ) ప్లీనరీ సమావేశం, కార్యకర్తల మహాసమ్మేళనం జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కొత్తూరి ప్రవీణ్‌ పిలుపునిచ్చారు. బుధవారం ఐనవోలు అంబేడ్కర్‌ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు కుమార్‌, రాజేందర్‌, అనిల్‌, నాగరాజు, ప్రవీణ్‌, గణేష్‌, జయపాల్‌ పాల్గొన్నారు.

బోధన రుసుం విడుదల చేయాలి

నయింనగర్‌, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్‌ చేశారు. బుధవారం హనుమకొండలోని కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు మాదం తిరుపతి, మాలోత్‌ రాజేష్‌నాయక్‌, మధు, సూరి, అరుణ్‌కుమార్‌, రంగస్వామి, గణేష్‌ పాల్గొన్నారు.

టిప్పర్‌ బోల్తా.. దంపతులకు తీవ్ర గాయాలు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: భీమదేవరపల్లి క్రాస్‌ రోడ్డు వద్ద అధిక లోడుతో వెళ్తున్న మట్టి టిప్పర్‌ బోల్తా పడిన ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌ మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన మేకల కొమురయ్య, జయ దంపతులు ద్విచక్ర వాహనంపై ములుకనూర్‌కు వెళ్తుండగా.. అధిక లోడుతో వస్తున్న మట్టి టిప్పర్‌ ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. అది బైక్‌ను తాకడంతో దానిపై ఉన్న భార్యభర్తలు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో హుస్నాబాద్‌ ఆసుపత్రికి తరలించారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం

భీమారం, న్యూస్‌టుడే: ఇటీవలే గుండెపోటుతో మృతిచెందిన సీనియర్‌ పాత్రికేయులు సుభాశ్‌ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ అన్నారు. భీమారంలో బుధవారం జరిగిన సుభాశ్‌ దశదిన కర్మలో ఆయన భారాస నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ హాజరై కుటుంబాన్ని ఓదార్చారు. గౌడ సంఘం పెద్దలు సుభాశ్‌ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. గౌడ సంఘాల జేఏసీ ఛైర్మన్‌ బైరి రవికృష్ణగౌడ్‌, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరిగౌడ్‌, గోపా జిల్లా అధ్యక్షులు రాజుగౌడ్‌, బీసీ సంఘం ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్‌గౌడ్‌, వరంగల్‌ ప్రెస్‌ క్లబ్‌ ప్రతినిధులు, జర్నలిస్టు సంఘం, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సుభాశ్‌ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌, జర్నలిస్టులు, భారాస నాయకులు

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

కాజీపేట టౌన్‌, న్యూస్‌టుడే: కాజీపేట పోలీస్‌ స్టేషన్‌లో ఓ సీఐపై పోక్సో కేసు నమోదైతే.. కొందరు సామాజిక మాధ్యమాల్లో తనపైనే కేసు నమోదు అయినట్లు కొందరు తప్పుడు పోస్టులు పెడుతున్నారని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్‌ వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. తప్పుడు పోస్టు వల్ల బంధువులు, ముఖ్యంగా పిల్లలు ఎంత ఇబ్బందులు ఎదుర్కొంటారో తనకు తెలుసన్నారు.

గూడ్సు రైలు బోగిలో పొగలు

కమలాపూర్‌, న్యూస్‌టుడే: మందమర్రి నుంచి కర్ణాటక రాష్ట్రానికి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్సు రైల్లోని ఓ బోగిలో పొగలు రావడంతో అప్రమత్తమైన గార్డు, డ్రైవర్‌ ఉప్పల్‌ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. ముందుగా జమ్మికుంటలో గూడ్సు రైలును నిలివేయాలని భావించినా కుదరకపోవడంతో ఉప్పల్‌ స్టేషన్‌లో నిలిపివేశారు. అప్పటికే సమాచారం అందుకున్న హుజూరాబాద్‌ అగ్నిమాపక కేంద్రం అధికారులు వచ్చి నీళ్లు చల్లి, పొగలను చల్లార్చారు. గంట తరవాత గూడ్సు రైలును అధికారులు పంపించేశారు. అగ్నిమాపక ఎస్‌ఎఫ్‌వో శ్రీనివాస్‌, సీహెచ్‌.సందీప్‌, డి.శివారెడ్డి, ప్రభాకర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్‌-1 అభ్యర్థులతో చర్చలు జరపాలి

విద్యానగర్‌, న్యూస్‌టుడే: గ్రూప్‌-1 అభ్యర్థులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, జీవో నెంబర్‌ 29 రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్‌ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం గ్రంథాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అశోక్‌, నరేష్‌ చరణ్‌, వీరన్న సూర్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో గోడ పత్రిక ఆవిష్కరణ

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో స్టూడెంట్‌ యాక్టివిటీ సెంటర్‌ (సాక్‌) ఆధ్వర్యంలో విద్యార్థులు గత 10 రోజుల పాటు ఎంతో కష్టపడి వేసినా గోడ ఆర్ట్‌ను కళాశాల ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ కె.అశోక్‌రెడ్డి విద్యార్థి ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఎం.నర్సింహారావు, డాక్టర్‌ డి.ప్రభాకరాచారి, డాక్టర్‌ టి.మధుకర్‌రెడ్డి, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉద్యోగ అవకాశాలు కల్పించండి

మడికొండ: భూ నిర్వాసితుల్లో కొంత మందికి ఇప్పటికి పరిహారం అందలేదని, అలాగే త్వరలో ప్రారంభం కానున్న రైల్వే పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ కడియం కావ్యకు బుధవారం అయోధ్యపురం గ్రామస్థులు వినతి పత్రం ఇచ్చారు. కాజీపేట మండలం అయోధ్యపురంలోని రైల్వే వ్యాగన్‌ తయారీ, మరమ్మతు పరిశ్రమను బుధవారం వరంగల్‌ ఎంపీ డాక్టర్‌ కడియం కావ్య సందర్శించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలిసి చర్చించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అయోధ్యపురం మాజీ సర్పంచి గాదం యాదగిరియాదవ్‌, ఉల్లంగుల శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

కమలాపూర్‌, న్యూస్‌టుడే: కమలాపూర్‌లోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్‌ ప్రావిణ్య బుధవారం తనిఖీ చేశారు. మార్కెటులో దిమ్మెలపై రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. డీఎస్వో ఉమారాణి, డీఆర్డీఓ నాగపద్మజ, తహసీల్దార్‌ సురేశ్‌, ఎంపీడీవో జి.బాబు, పౌరసరఫరాల డీటీలు నాగేంద్రప్రసాద్‌, రమేశ్‌, సూపర్‌వైజర్‌ యాకయ్య, ఏవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

కాజీపేట టౌన్‌: మున్సిపల్‌ పారిశుద్ధ్య, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులను క్రమబద్ధీకరిస్తూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాన్న డిమాండ్‌తో శుక్రవారం తలపెట్టిన చలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్‌ ఉద్యోగులు, కార్మికుల సంఘం (సీఐటీయూ అనుబంధం)కార్యదర్శి టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. భట్టుపల్లి, కడిపికొండ, దర్గా కాజీపేటలోని మున్సిపల్‌ కార్మికులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, కరుణ, ప్రకాశ్‌, అఫ్జల్‌, శ్రీను, మౌనిక, సతీష్‌, రేణుక పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయండి

వరంగల్‌ విద్యావిభాగం: విద్యాహక్కు చట్టాన్ని పాఠశాలల్లో అమలు చేయాలని ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం (ఎల్టా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని కొమురయ్య డిమాండ్‌ చేశారు. బుధవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్నారు. నాయకులు ప్రణామిణి, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఐ-సెట్‌ నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలి.

విద్యానగర్‌ : ఐ-సెట్‌ 2024-25 నిర్వహణ కోసం కేటాయించిన నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచార్ల రాంబాబు అన్నారు. బుధవారం కేయూలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ ఇన్‌ఛార్జి నిమ్మల రాజేష్‌, సతీష్‌, సాయి, రాజ్‌ కుమార్‌, శ్రీనివాస్‌ సంపత్‌, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్ల పట్టివేత


దామెర, న్యూస్‌టుడే: అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం పట్టుకున్నట్లు దామెర ఎస్సై అశోక్‌ తెలిపారు. ల్యాదెళ్ల నుంచి హనుమకొండకు అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తుండటంతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

పరకాల, న్యూస్‌టుడే: రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వరంగల్‌ ఉమ్మడి జిల్లా ఉద్యమ కళాకారుల సంఘం కన్వీనర్‌ కీర్తి సమ్మక్క బుధవారం కోరారు. భారాస ప్రభుత్వం ఉద్యమకారును విస్మరించిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన

పరకాల, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై అవగాహన కోసం బుధవారం పరకాల ఆర్టీసీ బస్టాండులో కళారంజని సందీప్‌ కళాబృందం ప్రదర్శన నిర్వహించారు. ఎయిడ్స్‌ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. ఆట, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. డాప్కో డీపీఎం స్వప్న, మారి సంస్థ ప్రాజెక్టు మేనేజర్‌ సదానందం, కళాకారులు సందీప్‌, చిరంజీవి, అర్జున్‌, నాగరాజు, రజని తదితరులు పాల్గొన్నారు.



పరకాలలో ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

పరకాల నియోజకవర్గం

ఘనంగా కొండా మురళి జన్మదిన వేడుకలు



శాయంపేట, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద కేకు కోసి మిఠాయిలు పంచారు. శంకరాచారి, భాస్కర్‌, సాధిక్‌, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పోలీస్‌శాఖ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా అన్నారు. బుధవారం ఆత్మకూరు ఠాణాను తనిఖీ చేశారు. పోలీస్‌ సిబ్బంది కిట్‌ ఆర్టికల్స్‌, కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈస్ట్‌జోన్‌ డీసీపీ రవీందర్‌, ఏసీపీ కిషోర్‌కుమార్‌, సీఐ సంతోష్‌, ఎస్సై పరమేశ్వర్‌ పాల్గొన్నారు..



పోలీస్‌ సిబ్బంది కిట్‌, ఆర్టికల్స్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ ఝా

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, తిరుమలగిరిలోని కేజీబీవీ విద్యార్థులకు బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్‌ ట్రస్ట్‌ సభ్యులు గంగిశెట్టి దయాకర్‌ జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు నిర్మలకుమారి, కేజీబీవీ ఎస్‌వో వాసవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేయడం తగదు

ఆత్మకూరు: మాదిగల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగ జాతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేయడం తగదని ఎమ్మార్పీఎస్‌ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న హనుమకొండలో ఎమ్మార్పీఎస్‌ అనుబంధ సంఘాల మాదిగ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు కార్యదర్శి మురళి, దినేష్‌ పాల్గొన్నారు..